సాక్షి
నల్లగొండ
గురువారం । 9 । జనవరి । 2025



సీఎం.. రైతుల పక్షపాతి
సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. - 8లో



తెలుసుకుని పనిచేయాలి
ఏఈలు ఉద్యోగంలో మెళకువలు తెలుసుకుని పనిచేయాలని ఇరిగేషన్ శాఖ సీఈ అజయ్‌కుమార్ అన్నారు. - 8లో



మంత్రి పీఏనంటూ..
మంత్రి పీఏనంటూ మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వ్యక్తిని కోదాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. - 8లో

న్యూస్‌రీల్

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు నీతూసింగ్ ఎంపిక



నల్లగొండ టూటౌన్: న్యూ ఢిల్లీలో ఈనెల 11, 12 తేదీల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్‌కు చెందిన నీతూసింగ్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన యువ తీయువకులతోపాటు స్పెషల్ అతిథి యూత్ ఐకాన్‌గా నీతూసింగ్ హాజరు కానున్నట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం నీతూసింగ్ చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా నీతూసింగ్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఏబీవీపీ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

చింతపల్లి: భూ నిర్వాసితులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామ భూ నిర్వాసితులతో బుధవారం చింతపల్లిలోని సాయి సుమంగళి గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 289మందికి మండల కేంద్రంలోని 154 సర్వే నంబర్‌లో పునరావాసం కింద ప్లాట్లను డ్రా పద్ధతిన కేటాయించారు. అనంతరంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, ఈఈ రాములు, డీఈ కాశీం, ఏఈ రఘు, మర్రిగూడ, చింతపల్లి తహసీల్దార్లు శ్రీనివాస్, రమాకాంత్ శర్మ, ఆర్‌ఐలు సునీత, రామారావు, మండల సర్వేయర్ రతన్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతిపై డీఆర్‌ఓ బదిలీ

నల్లగొండ : నల్లగొండ డీఆర్‌ఓగా పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అమరేందర్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ చేస్తూ ప్రభుత్వ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చింతపల్లి: పీహెచ్‌సీలు, ఉపకేంద్రాల్లోని వైద్యులు గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేస రవి, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఇక్బాల్, సిబ్బంది ఉన్నారు.

గుట్ట ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

యాదగిరిగుట్ట రూరల్, యాదగిరిగుట్ట: నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లోని ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయడంతో యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ గోపినాయక్ బుధవారం సస్పెండ్ అయ్యారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సర్వే నంబర్ 472, 473లో 154 డాక్యుమెంట్‌లను డిసెంబర్ 21, 22, 23వ తేదీల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సోమవారం స్టాంప్స్ అండ్ డ్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన విచారణకు ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అధికారి మధుసూదన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఆడిట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ బుధవారం యాదగిరిగుట్టలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. డీటీసీపీ పర్మిషన్ లేకుండా, కేవలం నాలా పర్మిషన్‌తోనే ఈ భూమిని, 154 డాక్యుమెంట్‌లుగా రిజిస్ట్రేషన్ చేసినట్లుగా నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లోని ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేసినందుకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ గోపి నాయక్‌ను సస్పెండ్‌చేసినట్లు తెలిపారు. ఈ డాక్యుమెంట్‌లను ప్రొహిబిటెడ్‌లో పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

• శ్రీవారికి గరుడ సేవ



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సిద్ధార్థ కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీవారి గరుడ సేవను తిలకిస్తున్న భక్తులు

11 నుంచి టీసీసీ పరీక్షలు

రామగిరి(నల్లగొండ): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నట్లు డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు www. bse.teangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట కుట్టు మిషన్ తెచ్చుకోవాలని కోరారు.

అడ్డగోలుగా ఔట్ సోర్సింగ్

గిరిజన గురుకుల కాలేజీల్లో అక్రమంగా నియామకాలు

- సిబ్బంది కొరత పేరుతో పోస్టుల అమ్మకాలు
- ఒక్కో పోస్టును రూ.2 లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపణ
- హైదరాబాద్ కేంద్రంగా సాగిన నియామకాల బాగోతం
- ఓ ఉన్నతాధికారి తమ బంధువు ద్వారా వసూళ్లు



గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఔట్ సోర్సింగ్ పేరుతో ఒక్కో పోస్టుకు రూ.2లక్షల వరకు ముడుపులు తీసుకొని అక్రమంగా నియామకాలు చేపడుతున్నారు. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఉద్యోగాలు ఇచ్చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తతంగమంతా హైదరాబాద్‌లోని ఆ శాఖలోపనిచేసే ఓ అధికారి బంధువు ద్వారా జరగుతున్నట్టు సమాచారం.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో దందాకు తెరలేచింది. హైదరాబాద్‌లోని ఆ శాఖాధిపతి కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి అండదండలతో ఆయన బంధువు ఒకరు ఈ దందా చేస్తున్నట్లు తెలిసింది. పోస్టులు ఉన్నా, లేకున్నా భారీగా ముడుపులు పుచ్చుకొని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తున్నట్లు తెలిసింది. జిల్లా స్థాయిలో వీటికి సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు. పోనీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేస్తున్నారా? అంటే అదీ లేదు. నేరుగా శాఖాధిపతి కార్యాలయంలో నుంచే ముడుపులు ముట్టజెప్పిన వారికి ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మరింత మందికి పోస్టింగ్ ఇస్తామని భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వెల్లువెతుతున్నాయి.

ఔట్ సోర్సింగ్ ఏదీ?

గిరిజన సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయం నుంచి జారీ అవుతున్న పోస్టింగ్ ఆర్డర్లలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఏదనేది స్పష్టం చేయడం లేదు. ఏ ఏజెన్సీ ద్వారా ఈ నియామకాలు చేస్తున్నారనేది అభ్యర్థులకు ఇచ్చిన ఉత్తర్వుల కాపీల్లో పేర్కొనలేదు. సాధారణంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా వ్యక్తిగతంగా ఆర్డర్లను జారీ చేయదు. కానీ గిరిజన గురుకుల కాలేజీల్లో పోస్టులకు మాత్రం నేరుగా ఆ సొసైటీ నుంచే ఆర్డర్లు జారీచేస్తుండటం గమనార్హం. పైగా అందులో తాము నియమిస్తున్న సిబ్బందికి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా గౌరవ వేతనం చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అసలు ఆ పోస్టుల భర్తీకి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని ఆ శాఖ ఖరారు చేసిందా? చేస్తే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారానే పోస్టులను భర్తీ చేయాలి. గురుకులాల సొసైటీ ఎందుకు ఆర్డర్లు జారీ చేస్తోంది. లేని ఏజెన్సీ పేరుతో వారికి గౌరవ వేతన ఎలా చెల్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జాయిన్ చేసుకోవాలంటూ ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి

గిరిజన గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేస్తూ ఆర్డర్లు జారీ చేస్తున్న అధికారులు వారిని ఆయా పోస్టుల్లో చేర్చుకోవాలని ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి పెంచారు. ఏజెన్సీ లేకుండా వారిని జాయిన్ చేసుకుంటే వారికి గౌరవ వేతనం చెల్లించాల్సి వచ్చినప్పుడు తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని జాయిన్ చేసుకునేందుకు ప్రిన్సిపాళ్లు నిరాకరిస్తున్నారు. ఆ పోస్టులకు ఏ ఏజెన్సీ పేరుతో తాము బిల్లులు చేయాలనేది అర్థం కావడం లేదని కొందరు ప్రిన్సిపాళ్లు అంటున్నట్టు తెలిసింది. దీంతో ఆ శాఖ కార్యాలయం నుంచే ప్రిన్సిపాళ్లకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది.

ఒక్కో పోస్టుకు రూ.2 లక్షలు?

ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో సిబ్బంది కొరత పేరుతో హైదరాబాద్‌లోని ఆ శాఖాధిపతి కార్యాలయం నుంచి గురుకులాల సొసైటీ పేరుతో ఆర్డర్లు జారీ అవుతున్నాయి. ల్యాబ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ తదితర పోస్టులను అడ్డగోలుగా అమ్ముకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లోని ఆ శాఖ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారు కావడం, ఇప్పుడు అదే అధికారి తన సమీప బంధువు నేతృత్వంలో ఈ వసూళ్ల పర్వానికి తెరతీసినట్లు తెలిసింది. ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల చొప్పున బేరం కుదుర్చుకున్నారు. ఇప్పటికే 30కి పైగా పోస్టులకు డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

సమగ్ర విచారణ జరిపించాలి

గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో సిబ్బంది కొరత పేరుతో పోస్టుల భర్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. ఈ పోస్టుల భర్తీలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు తెలిసింది. జిల్లా స్థాయిలో భర్తీ చేయాల్సిన పోస్టులను రాష్ట్ర స్థాయిలో, ఏజెన్సీ లేకుండానే ఎలా భర్తీ చేస్తారు.

– రవినాయక్,
రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు

మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు కుట్రపూరితం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే కేసు పెట్టిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆరోపించారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్‌పై కేసు చూస్తే రాజకీయంగా కక్షసాధింపు కోసమే పెట్టిన కేసు అని అర్థమవుతోందన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం రైతులను దగా చేసిందన్నారు. రుణమాఫీ సగం కూడా చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వెల్లువెత్తిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించడానికే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. ఈడీ, ఏసీబీలు పోటీ పడి కేసులు పెడుతున్నారని, ఉద్యమ శిఖరం కేసులకు భయపడే వ్యక్తి కాదని స్పష్టం చేశారు. ఓటుకు నోటు కేసులో పట్టపగలు దొరికిన దొంగ రేవంత్‌రెడ్డికి ప్రజలే సరైన సమయంలో తగినరీతిలో బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కేవీ.రామారావు, బొమ్మరబోయిన నాగార్జున, జమాల్‌ఖాద్రీ, రంజిత్, చల్లా కోటేష్‌యాదవ్, క్రాంతి, కట్ట శ్రీను పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

నకిరేకల్: పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను డీపీఓ కొండా వెంకయ్య ఆదేశించారు. నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో పెండింగ్ పెట్టవద్దని సూచించారు. గ్రామాల్లోని నర్సరీలను నిరంతరం పర్యవేక్షిస్తూ మొక్కలను కాపాడాలన్నారు. రోడ్ల వెంట ఉన్న చిన్న మొక్కలు, చెట్లకు నీరుపోయించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్లకు స్థలాలు గుర్తించాం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాలో 270 ఎకరాల స్థలాన్ని గుర్తించామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మహిళలందరికీ ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సభ్యులకు సుమారు 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను చేపట్టే విషయంపై బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఆదివారంలోగా తనిఖీ చేసి ఆయా భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన భూములను సంక్రాంతిలోపు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, రెడ్‌కో జిల్లా మేనేజర్ ఎం.పాండురంగారావు తదితరులు హాజరయ్యారు.



కేతేపల్లి తహసీల్దార్ కార్యాయలంలో రైతుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి

కేతేపల్లి: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ధరణి రికార్డులు, పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇదే సమయంలో కార్యాలయానికి వచ్చిన బండపాలేనికి చెందిన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఇరువురు రైతులకు సంబంధించిన భూ సమస్యపై మాట్లాడుతూ భూమి మోకా మీద ఉన్న వారికి నిబంధనల ప్రకారం పట్టా చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగమణి ఉన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, హాజరైన పోలీస్ అధికారులు

- దొంగతనాల నివారణకు నిఘా పెంచండి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: జిల్లాలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులతోపాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కోరారు. బుధవారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలు నివారణ కోసం రాత్రింబవళ్లు గస్తీ నిర్వహించాలని, పాత నేరస్తుల కదలికలపైనా పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. రాత్రింబవళ్లు అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించాలన్నారు. ఇళ్ల పరిసరాలు, ప్రతి కాలనీ, ముఖ్యమైన కూడళ్లు, రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. బంగారు ఆభరణాలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్లే పట్టణ. గ్రామీణ ప్రజలు సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ముందుగానే తెలియజేస్తే అక్కడ పోలీస్ వారు నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. ఇళ్లలో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఒంటిరిగా ఉన్న సమయంలో అపరిచితులు వచ్చి చెప్పే సమాచారం నమ్మవద్దన్నారు. అనుమానితులు సంచరిస్తుంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లు, 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

బీజేపీ కార్యాలయంపై దాడి సిగ్గుచేటు



క్లాక్ టవర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తూ బుధవారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కార్యాలయంపై దాడి చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేసిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి, వెంకటేశం, వంగూరి రాఖీ, మహేష్, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

5వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్

ఇప్పటికి 2 వేల ఎకరాల్లో నాటిన మొక్కలు

- సాగుపై విస్తృత అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ
- మార్చి చివరినాటికి టార్గెట్ పూర్తిపై దృష్టి
- రాయితీలు కల్పిస్తుండడంతో సాగుపై రైతుల ఆసక్తి



నల్లగొండ మండలం గుండ్లపల్లిలో సాగుచేసిన ఆయిల్‌పామ్ తోట



ఆయిల్‌పామ్ నర్సరీలు ఏర్పాటు చేసిన గ్రామాలు	
మండలం	గ్రామం
మర్రిగూడ	ఇందుర్తి
కేతేపల్లి	కేతేపల్లి
నాంపల్లి	నాంపల్లి
పెద్దవూర	లింగంపల్లిల, తిప్పలమ్మగూడెం
కట్టంగూరు	ఇనుపాముల

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల సాగుపై ఉద్యానవన శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 10,400 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారు. అయితే ఈ ఏడాదికి గాను 5 వేల ఎకరాల్లో తోటలు సాగు చేయాలని ఉద్యానవన శాఖ లక్ష్యం నిర్ధారించింది. ఇందులో భాగంగా గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారు. 600 ఎకరాలకు ప్రభుత్వం నుంచి మంజూరు లభించింది. మార్చి నాటికి మరో 2,400 ఎకరాల్లో సాగు చేయించేందుకు ఉద్యానవన శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

సాగుకు ప్రోత్సాహం ఇలా..

ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలలకు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం కూడా తోటల సాగుకు రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది. పంట చేతికి వచ్చేంత వరకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వమే ఎరువులు, అంతర్ పంటసాగుకు ఏటా ఎకరాకు రూ.4,200 ఇస్తోంది. ఎకరాకు 57 మొక్కలు అవసరం కాగా ఒక్కో మొక్కకు రూ.193 సబ్సిడీ ఇస్తుండగా ఇందులో రైతువాటా రూ.20 మాత్రమే. దిగుబడి నాలుగేళ్లలో ప్రారంభమై 30 ఏళ్ల వరకు వస్తుంది. ఇదేకాక పెద్ద రైతులకు 80 శాతం, చిన్న రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందిస్తోంది. దీనిపై ఉద్యానవన శాఖ కూడా అవగాహన కల్పిస్తుండడంతో తోటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఆయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు..

గెలల నుంచి ఆయిల్ తయారీ చేసే యూనిట్‌ను నిర్మించడానికి పతంజలి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా పలు సందర్భాల్లో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆయిల్ తయారీ యూనిట్ నిర్మాణం చేపట్టాలని పతంజలి సంస్థ ప్రతినిధులకు సూచించారు. ఆయిల్ తయారీ ఫ్యాక్టరీని పూర్తి చేస్తే జిల్లాలోనే ఆయిల్‌పామ్ గెలల దిగుమతులకు డిమాండ్ ఉండనుంది.

టన్ను ధర రూ.20,506

ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.20,506 ధర పలుకుతోంది. పతంజలి సంస్థ వారు జిల్లాలో ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయడంకోసం అనుముల, త్రిపురారం మండలం ముకుందాపురం, నిడమనూరు మండలం ముప్పారం, మాడుగుల మండలం కుక్కడం, నల్లగొండ మండలం చందనపల్లిలో కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులు నేరుగా ఆయా కేంద్రాలకు తీసుకెళ్తే వెంటనే కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తారు.

మంచి లాభాలు ఉంటాయి

ఆయిల్‌పామ్ తోటల సాగుకు చౌడు భూములు మినహా నీటి సౌకర్యం ఉన్న అన్నిరకాల భూములు అనుకూలంగా ఉంటాయి. మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలలకు మంచి డిమాండ్ ఉంది. తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తే మంచి లాభాలు ఉంటాయి.

– వీవీఎస్ సాయిబాబు,
జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, నల్లగొండ

ధరలేక.. దయనీయం



ఈ ఫొటోలోని రైతు పేరు దాసరి జంగారెడ్డి, హాజీపూర్ గ్రామం, బొమ్మలరామారం మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా. ఈ రైతు ఎకరంన్నర విస్తీర్ణంలో టమాట సాగు చేశాడు. పెట్టుబడికి సుమారు రూ.70 వేలు ఖర్చయింది. 15 రోజుల నుంచి పంట దిగుబడి వస్తోంది. బుధవారం మార్కెట్‌కు తరలించగా 25 కిలోల టమాట బాక్స్‌కు 125 రూపాయల ధర లభించింది. దీంతో టమాట ఏరడానికి కూలీల ఖర్చుతో పాటు మార్కెట్ తరలించడానికి ఆటో కిరాయిలు మీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తన తోటలోని టమాటలు దారిన వెళ్లేవారికి, గ్రామస్తులు ఉచితంగానే ఇచ్చాడు.



ఈ ఫొటోలోని యువ రైతు పేరు పక్కీరు సందీప్‌రెడ్డి. యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మల రామారం మండలం, హాజీపూర్ గ్రామం. ఐటీఐ చదివి ఉద్యోగం కన్నా వ్యవసాయం మేలని కూరగాయలను సాగుచేస్తున్నాడు. ఇతను 30 గుంటలలో టమాట సాగు చేశాడు. సాగు చేసిన నాటి నుంచి టమాట ధర 25 కిలోల బాక్స్ 100 రూపాయలే ఉంది. దీంతో రెండు పర్యాయాలు టమాటను తెంపి మార్కెట్‌కు తరలిస్తే ఏమీ గిట్టుబాటు కావడం లేదని టమాట తోటను వదిలేశాడు. జీవనోపాధి కోసం కూరగాయల సాగును ఎంచుకుంటే నష్టాలే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.



బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో వదిలేసిన టమాట పంట

పడిపోయిన టమాట ధర
- 25కిలోల బాక్స్ ధర వంద రూపాయలే..
- కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో చేలపైనే వదిలేస్తున్న రైతులు

బొమ్మలరామారం : గత నెల వరకు హడలెత్తించిన టమాట ధర నేడు దారుణంగా పడిపోయింది. మొన్నటి వరకు రిటైల్‌గా కిలో ధర రూ.70 వరకు పలకగా.. ఇప్పుడు రూ.10 ఉంది. రైతులకు మాత్రం కిలోకు రెండు మూడు రూపాయలే పడుతుంది. సీజన్‌లో ఒకే సమయంలో భారీగా దిగుబడి రావడంతో ధర పతనమైంది. కొన్ని రోజులుగా 25 కిలోల పెట్టె టమాట ధర 100 నుంచి 150 రూపాయలు దాటడం లేదు. దీంతో టమాటను చేలలో తెంపడానికి కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు టమాట పంటను చేలపైనే వదిలేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల నుంచి రోజూ టమాట దిగుబడిని రైతులు హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. హోల్‌సేల్‌గా వ్యాపారులు 25కిలోల బాక్స్ ధర కేవలం రూ.60 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. ధర గిట్టుబాటుకాక రైతులు ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రైతులు టమాట పంటను గొర్రెలు, మేకలకు మేతకు వదిలేస్తున్నారు.



జీవాలకు మేతగా మారిన టమాట తోట

ప్రణాళికాబద్ధంగా సాగుచేయాలి



కూరగాయల రైతులు ఒకేసారి ఎక్కువ విస్తీర్ణంలో ఒకే రకం కురగాయలను సాగుచేయడంతో మార్కెట్ అవసరాల కన్నా ఎక్కువ దిగుబడి పెరిగి ధరలు గిట్టుబాటు కావడం లేదు. ఒకే రకమైన కూరగాయలు కాకుండా మల్టీక్రాప్(పలు రకాలు) కూరగాయలను దశల వారీగా ప్రణాళిక బద్ధంగా సాగుచేస్తే నష్టాల బారిన పడకుండా ఉంటారు.

– సుభాషిని, ఉద్యానవన అధికారిణి, యాదాద్రి భువనగిరి జిల్లా

క్లుప్తంగా

ఎన్జీ కళాశాలలో నేడు జాబ్‌మేళా

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎన్జీ కాలేజీ)లో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అనిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ), పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాకు 2025లో డిగ్రీ పూర్తిచేయనున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.

వైద్య కళాశాలకు మహిళ మృతదేహం అప్పగింత



సరోజిని (ఫైల్)

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని 48వ వార్డుకు చెందిన సోమ సరోజిని(85) అస్వస్థతతో బుధవారం మృతిచెందారు. సరోజిని కోరిక మేరకు ఆమె కుటుంబ సభ్యులు రవి, నాగలక్ష్మి దంపతులు స్థానిక స్పందన శరీర అవయవదాన సంస్థకు సమాచారం అందించగా సరోజిని మృతదేహాన్ని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహవీర్ వైద్య కళాశాలకు విద్యార్థుల పరిశోధనా నిమిత్తం అంబులెన్స్ ద్వారా పంపించారు. స్పందన శరీర అవయవదాన సంస్థ అధ్యక్షుడు గుండా రమేష్, ప్రధాన కార్యదర్శి మిట్టగోల కోటయ్య, కోశాధికారి పిచ్చిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు, సామాజికవేత్త రమేష్ సరోజిని కుటుంబ సభ్యులను అభినందించారు.

గుండెపోటుతో డిప్యూటీ సూపరింటెండెంట్ మృతి

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ రాఘవేందర్‌రావు(54) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం దేవరకొండ డిపోలో విధులకు హాజరైన ఆయన సాయంత్రం 6గంటల సమయంలో విధులు ముగించుకొని హైదరాబాద్‌కు బయల్దేరేందుకు బస్సు కోసం వేచి ఉండగా.. ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన పలువురు ఆయనను దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ రమేష్‌బాబు, ఏడీఎం సైదులు, ఉద్యోగులు, సిబ్బంది ఆస్పత్రికి చేరుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



థావూనాయక్ మృతదేహం

మఠంపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ ఆఫ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన మఠంపల్లి మండలం కొత్తతండాలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాకు చెందిన రైతు బానోతు థావూనాయక్ (43) వ్యవసాయ పొలంలో విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో దానిని పరిశీలించేందుకు గాను సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. అప్పటికే ట్రాన్స్‌ఫార్మర్‌పై 11కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఉండడంతో అది గమనించని థావూనాయక్ ఏబీ స్విచ్ ఆఫ్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి థావూనాయక్ భార్యకు సమాచారం ఇవ్వగా.. ఆమె వెళ్లి చూసేసరికి అతడు మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పి. బాబు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు తమను ఆదుకోవాలని మృతుడి భార్య కోరుతోంది.

మంత్రి పీఏనంటూ వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

- మహిళలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న నిందితుడు
- ఇవ్వని వారికి లైంగికంగా వేధింపులు



వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్: మంత్రి ఉత్తమ్ పీఏనంటూ మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వ్యక్తిని బుధవారం కోదాడ పట్టణ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లికి చెందిన పంది యాదగిరి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల కిందట గూగుల్‌లో సెర్చ్ చేసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఫోన్ నంబర్లను తీసుకుని తాను మంత్రి ఉత్తమ్ పీఏనని చెప్పి డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. డబ్బులు ఇవ్వని వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడు. కోదాడకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళతో పాటు హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, నూతనకల్, నేరేడుచర్ల సూపర్‌వైజర్లకు కూడా రెండు నెలల కిందట ఫోన్ చేసి తాను మంత్రి ఉత్తమ్ పీఏ నరేష్‌రెడ్డిని అని చెప్పి లైంగికంగా వేధించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సదురు నిందితుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సులో వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో అతడి కోదాడలో అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఐడీ పార్టీ సిబ్బంది బాలు, శ్రీనివాస్, రామారావు, సతీష్‌నాయుడు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి

- రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



నల్లగొండ: సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా రైతు భరోసా సాయం కింద రైతులకు సంవత్సరానికి ఎకరాకు రూ.12వేలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. భూమిలేని రైతులను కూడా ఆర్థికంగా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసి చూపించామన్నారు. నల్లగొండ జిల్లాలో కొత్తగా 3.60లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వబోతున్నట్లు చెప్పారు. డిండి ప్రాజెక్టు ద్వారా రోజుకు అర టీఎంసీ చొప్పున 60రోజుల పాటు 30 టీఎంసీల నీరు వస్తుందన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి మాట్లాడడంతో రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగం టెండర్లకు ఆమోదం లభించిందన్నారు. ఆయన వెంట మందడి మధుసూదన్‌రెడ్డి, స్వామిగౌడ్ ఉన్నారు.

క్యాంపస్ సమాచారం

ఎంజీయూలో విద్యార్థులకు కారంతో భోజనం

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కారంతో భోజనం పెట్టారని పలువురు విద్యార్థులు యూనివర్సిటీ హాస్టల్ నిర్వాహకులపై మండిపడ్డారు. ×మంత్రి కోమటిరెడ్డి ఇలాఖాలో విద్యార్థుల ఆకలి గోస× అని బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఈ వార్త వైరల్ అయ్యింది. ఉదయం విద్యార్థులకు అల్పాహారం పెట్టాల్సిన హాస్టల్ నిర్వాహకులు భోజనం ఎందుకు పెట్టాల్సి వచ్చిందని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. హాస్టల్ విద్యార్థులకు మెను ప్రకారం భోజనం వడ్డించకపోవడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. హాస్టల్‌లో ఉంటున్న కొందరు విద్యార్థుల తండ్రులు అయ్యప్ప మాల ధరించడంతో వారు ఎల్లిపాయ తినమని చెప్పడంతోనే ఉదయం అల్పాహారం బదులుగా భోజనం పెట్టినట్లు హాస్టల్ నిర్వాహకులు రిజిస్ట్రార్‌కు వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

విచారణ జరిపించాలి

విద్యార్థులకు గొడ్డు కారం పెట్టిన ఘటనపై విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్వీ నాయకులు బుధవారం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, చల్లా కోటేష్‌యాదవ్, సైదిరెడ్డి, క్రాంతియాదవ్, బంగారు యాదవ్, శంకర్ తదితరులు ఉన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రామకృష్ణ

నల్లగొండ టూటౌన్: విద్యార్థులను విజయబాటలో నడిపించేందుకు అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ అవసరమని, బోధనా సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు రామకృష్ణ, లలిత అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బుధవారం అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్(ఫలితాల ఆధారిత విద్య) అనే అంశంపై అధ్యాపకులకు నిర్వహించిన శిక్షన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు కోర్సుపై పూర్తి అవగాహన కల్పించి ఉపాధి అవకాశాలను తెలియపర్చాలని అన్నారు. విద్యతో పాటు సామాజిక స్పృహను కూడా కల్పించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. విద్యార్థులను కొత్త ఆవిష్కరణల వైపు మళ్లించే దిశగా అధ్యాపకుల కృషి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ ఎం. రమేష్, డాక్టర్ వై. ప్రశాంతి, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో ముగిసిన శిక్షణ

నల్లగొండ టూటౌన్: తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ పద్ధతిపై మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎంజీయూ పరిధిలోని కళాశాలలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొని విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడం కోసం ఎలాంటి ప్రశ్నాపత్రాలను తయారు చేయాలనే అంశంపై చర్చించారు. పలువురు నిపుణులు వివిధ అంశాలపై అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. భాష, సాహిత్యం, అభ్యసన, విషయ పరిజ్ఞానంలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడంపై అధ్యాపకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ప్రియ, జాతీయ పరీక్ష సేవా కేంద్రం ప్రతినిధులు డాక్టర్ ఎం. నారాయణరెడ్డి, డాక్టర్ కొల్లేటి రఘుబాబు, మహదేవ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మాస్కులు

హెచ్ఎంపీవీ విస్తరిస్తుండడంతో పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. విద్యార్థులను మాస్కులు ధరించి పాఠశాలకు రావాలని ఆదేశించాయి. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు మాస్కులు ధరిస్తున్నారు.

– యాదగిరిగుట్ట, అర్వపల్లి



యాదగిరిగుట్టలో మాస్కులతో విద్యార్థులు



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..

బొలేరోను ఢీకొట్టిన కారు.. ఎనిమిది మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా కూలీలు

భూదాన్‌పోచంపల్లి: బొలేరో వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండ రావిరాల గ్రామానికి చెందిన మహిళా కూలీలు బుధవారం ఉదయం బొలేరో వాహనంలో పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కూలీ పని చేసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో సంస్థ సమీపంలోకి రాగానే చెరువు మూలమలుపు వద్ద డ్రైవర్ దొరగండ్ల బాలకృష్ణ వాహన వేగాన్ని తగ్గించి సంస్థ గేట్‌లోకి వెళ్తుండగా... వెనుకాలే వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు దొరగండ్ల పారిజాత, కాటమోని యాదమ్మ, గుండ్ల స్వరూప, బుద్దుల లక్ష్మి, ఓర్సు రజని, గుండ్ల కమలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా కారులో ప్రయాణిస్తున్న నాగోల్‌లోని స్నేహపురికాలనీకి చెందిన గుమ్మడి వంశీ, గుమ్మడి శశిధర్‌కు తల, ఛాతిలో గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహిళా కూలీలను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోదాడలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కోదాడ: కోదాడ పట్టణంలోని తేజ టాలెంట్ పాఠశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాలడుగు ఖ్యాతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించనున్న ఈ పోటీలను రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి హాజరవుతారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966148808 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విమాన గోపురం తాపడానికి బంగారం అందజేత



ఈఓ భాస్కర్‌రావుకు బంగారాన్ని అందజేస్తున్న జీఆర్టీ గ్రూప్ ప్రతినిధులు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం కోసం చెన్నైలోని జీఆర్టీ గ్రూప్ చైర్మన్ జీ. రాజేంద్రన్ 100 గ్రాముల బంగారాన్ని విరాళంగా ప్రకటించారు. బుధవారం స్వామివారిని దర్శించుకున్న జీఆర్టీ గ్రూప్ ప్రతినిధులు 100 గ్రాముల బంగారాన్ని ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు.

క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తాం



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తామని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో 68వ రాష్ట్రస్థాయి బాలుర హాకీ పోటీలను బుధవారం డీఈఓ భిక్షపతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతో నిరంతరం శిక్షణ తీసుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. నల్లగొండ పట్టణంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీవైఎస్‌ఓ నర్సిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో మెళకువలు తెలుసుకుని పనిచేయాలి

- నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్

నల్లగొండ: నీటిపారుదల శాఖలో ఏఈఈలుగా ఉద్యోగాలు పొందిన వారు సీనియర్ల సలహాలతో పాటు ఉద్యోగంలో మెళకువలు తెలుసుకుని పనిచేయాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని జీఎల్ గార్డెన్‌లో నీటిపారుదల శాఖలో కొత్తగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా నియమితులైన వారికి హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విధులపై అవగాహన పెంచుకుని, థియరీ నాలెడ్జ్‌ను విధులలో ప్రదర్శించాలని సూచించారు. సీనియర్ల సహకారంతో సందేహాలను నివృత్తి చేసుకొని ఉద్యోగంలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణ, ఎస్ఎస్‌పీ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రావు, మాల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, హైదరాబాద్ ఇంజనీర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రవీందర్, ఫైనాన్స్ జనరల్ సెక్రటరీ ఆంజనేయులు, జిల్లా ప్రెసిడెంట్ క్రాంతికుమార్, ఈఈ యాదవ్‌కుమార్, రేఖల ప్రభాకర్, శ్రీనివాస్, చేపూరి చక్రపాణి, మహేష్, శివరాజ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

శిశువు మృతి.. బంధువుల ఆందోళన

- దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో ఫర్నీచర్ ధ్వంసం



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు

దేవరకొండ: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శిశువు బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన మూడావత్ రాహుల్ భార్య నందినిని కాన్పు కోసం మంగళవారం ఉదయం 10గంటల సమయంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు నార్మల్ డెలివరీ అవుతుందని, వేచి చూడాలని కుటుంబ సభ్యులకు సూచించారు. నందినికి నొప్పులు రాకపోవడంతో ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు వైద్యులను కోరారు. మంగళవారం రాత్రి 11గంటల తర్వాత విధుల్లో ఉన్న వైద్యులు నార్మల్ డెలివరీకి ప్రయత్నించగా.. సాధ్యం కాకపోవడంతో ఆపరేషన్ చేయగా నందిని మగ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే శిశువు ఏడవకపోవడంతో హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించడంతో నందిని కుటుంబ సభ్యులు శిశువును హైదరాబాద్‌కు తరలించారు. కాగా అక్కడ శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో నందిని బంధువులు, కుటుంబ సభ్యులు దేవరకొండ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతిచెందాడని ఆరోపిస్తూ ఆస్పత్రిలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు ఆస్పత్రి వద్దకు చేరుకొని వారికి సర్ది చెప్పారు. ఎంక్వైరీ అధికారి భానుప్రసాద్ ఆస్పత్రి వద్దకు రావడంతో ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మంగ్తానాయక్‌ను వివరణ కోరగా.. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యం కారణం కాదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



నకిరేకల్ పట్టణంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నల్లగొండ: సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదేశానుసారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువగా వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్స్ ద్వారా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. మోసగాళ్లు వీడియో కాల్ చేసి ప్రభుత్వ దర్యాప్తు సంస్థల అధికారులుగా పరిచయం చేసుకుంటారని, ఆ తర్వాత వీడియో కాల్ చేసిన వ్యక్తి లేదా వారి సన్నిహిత కుటుంబ సభ్యులు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మనీలాండరింగ్ వంటి నేర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారని, అందువల్ల వీడియో కాల్ ద్వారా అరెస్టు చేస్తున్నామని చెబుతారని అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైందని, అరెస్ట్ వారెంట్ ఇష్యూ అయ్యిందని నకిలీ పత్రాలను చూపించి మోసగాళ్లు బాధితులను బెదిరిస్తారని చెప్పారు. అరెస్టు జరగకుండా ఉండేందుకు బాధితుల బ్యాంక్ ఖాతాల నుంచి మోసగాళ్లు తమ బ్యాంక్ ఖాతాలకు నగదు బదిలీ చేయించుకుంటారని అన్నారు. ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇటువంటి వీడియో కాల్స్ వస్తే ఎవరూ తమ వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని సూచించారు. వెంటనే కాల్ కట్ చేసి www.cybercrime.gov.in నందు లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు.